'మిట్స్' ప్రొఫెసర్ గిరిధర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె.గిరిధర్‌కు తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి పిహెచ్‌డి పట్టా లభించింది. ఎనాలిసిస్ అఫ్ ఇంప్రూవ్డ్ మోడల్స్ ఫర్ ఎనర్జీ ఎఫిసియెంట్ రౌటింగ్ ఇన్‌వానిటీ యూసింగ్ హైబ్రిడ్ మేతహేరిస్టిక్ ఆప్టిమైజషన్ అల్గోరిథమ్స్ పై అక్కడే పనిచేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.అన్బుఅనంత్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనను గాను డాక్టరేట్‌ను అందించారు. గిరిధర్‌ను కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ దినేష్ అభినందనలు తెలియజేశారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొట్టిన ఆర్‌టిసి బస్సు
- 40 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను 108, ఆటోల్లో జిల్లా ఆస్పత్రికి తరలింపు
- పలువురి పరిస్థితి ఆందోళనకరం
- క్షతగాత్రులు, బాధితుల కుటుంబీకులతో అట్టుడికిన ఆస్పత్రి
- ఆందోళనకరంగా ఉన్న ఇద్దరిని బెంగళూరు, తిరుపతికి రెఫర్
- బాధితులను పరామర్శించిన సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే, డిఎస్‌పి
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

ప్రమాద ఘటనపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. 40 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్ర కలకలం రేపిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం ఉదయం రోజు మాదిరిగానే మదనపల్లి నుండి గుర్రంకొండ మీదుగా గాలివీడు వెళ్ళింది. అక్కడి నుంచి తిరిగి ప్రయాణికులతో మదనపల్లికి గుర్రంకొండ మీదుగా వస్తున్న సమయంలో మార్గమధ్యంలోని తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపాన ఉన్న సర్కారు తోపు వద్ద ఆర్టీసీ బస్సు-లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో ఆర్టీసీ బస్సులోని డ్రైవర్, కండక్టర్ సహా 40 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ క్షతగాత్రులను 108లో హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరి కొందరిని ప్రైవేటు ఆటోలు, కార్లలలో స్థానిక జిల్లా ఆసుపత్రితో పాటు స్థానికంగా ఉండే ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. గాయపడ్డ వారికి ఆసుపత్రి అత్యవసర విభాగం డాక్టర్లు, సిబ్బంది మెరుగైన వైద్య చికిత్సలు అందించారు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న మదనపల్లి మండలం, సిటిఎం గ్రామం, రెడ్డివారిపల్లెకు చెందిన రైతు సి.వెంకటసుబ్బయ్య, ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

గాయపడిన కండక్టర్

సర్కారుతోపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్న ఆర్‌టిసి బస్సు, లారీ

డ్రైవర్ రామకృష్ణ, గుర్రంకొండ మండలం, నడింకండ్రిగకు చెందిన రైతు గిరిబాబు పరిస్థితి ఆందో ళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు, తిరుపతిలకు ప్రైవేట్ అంబులెన్స్‌లలో తరలించారు. 33 మంది బాధితులను జిల్లా ఆస్పత్రి లోని ఐసియు, స్పెషల్ వార్డులకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే, డిఎస్‌పి : సర్కారు తోపు తోపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులను మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాష, డిఎస్‌పి కొండయ్య నాయుడు, ఎస్ఐ దిలీప్ కుమార్ తదితరులు పరామర్శించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డాక్టర్లను ఆదేశించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎమ్మెస్ రాజు, ఆర్ఎంఒ ప్రసాద్ రాజులతో మాట్లాడి గాయపడ్డ వారికి దగ్గరుండి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూడాలని ఆదేశించారు. ఎవరు అధైర్య పడవద్దని ఎంత ఖర్చైనా పర్వాలేదు భరించి మెరుగైన వైద్య సేవలు అందించి అందరూ త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాష, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్ కండక్టర్లతో పాటు, మరి కొంత మంది పరిస్థితి ఆందోళన కరంగా ఉందని వారిని దగ్గరుండి తిరుపతి బెంగళూరుకి రిఫర్ చేయించారు. ఘటన స్థలాన్ని ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్తనాదాలతో అట్టుడికిన ఆసుపత్రి : మదనపల్లి జిల్లా ఆసుపత్రికి క్షతగాత్రులను తీసుకురావడంతో బాధితుల ఆర్తనాదాలు, బంధువులు, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మంచాలపై పడుకుని రక్త గాయాలతో ఉన్న ఆత్మీయులను పలకరించి ఎలా జరిగింది నాయనా...! ఏం కాలేదు కదా అంటూ ఓదార్చి గుండెలకు హత్తుకోవడం చూపరులను కలచి వేసింది.

అతివేగమే ప్రమాదానికి కారణమా : డివైడర్ వద్ద క్రాస్ చేస్తున్న లారీని వేగంగా వచ్చిన బస్సు దాటుకునే సమయంలో కంట్రోల్ తప్పిన బస్సు లారీని ఢీ కొట్టింది. దీంతో 40 మంది ప్రయాణీకులు గాయపడాల్సిన పరిస్థితి వచ్చింది.

బస్సులో ఇరుక్కున్న డ్రైవర్‌ను జెసిబితో వెలికి తీసిన స్థానికులు : లారీ బస్సు ఎదురెదురు ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. అతన్ని బయటకు తీయడానికి స్థానికులు నానా తంటాలు పడ్డారు. చివరికి స్థానికంగా ఉన్న జెసిబి సాయంతో డ్రైవర్ ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను ప్రైవేటు ఆటోలు, 108 వాహనాలలో తరలించేందుకు సహకరించి ప్రాణాపాయం తప్పేలా చేశారు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు : ప్రయాణికులతో వెళుతున్న బస్సును నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. క్షతగాత్రులను అన్ని రకాలుగా ఆదుకుని మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. అందరూ కోలుకునే వరకూ ప్రభుత్వమే వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు.

అంగళ్లు మండల పరిధిలోని సర్కారుతోపు వద్ద ఆర్‌టిసి బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

విద్యార్థులకు ఆటలతో మనోవికాసం : మంత్రి

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

విద్యార్థులకు ఆటలు ఆరోగ్యంతో పాటు మనో వికాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పరికరాల పంపిణీ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు నిత్యం కనీసం ఒక అరగంట నుంచి గంట పాటైన ఆటలు ఆడించాలన్నారు. ప్రస్తుతం ప్రతి పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం అలవడుతుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపి ఆరోగ్యంగా ఉండాలన్నారు. క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. రాయచోటిలో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయడమే కాకుండా ఇండోర్ గేమ్స్ సదుపాయాలను కల్పిస్తామన్నారు. క్రీడలలో ప్రతిభ చూపిన వారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని చెప్పారు. అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంబేపల్లి నివాసి, ఎన్ఆర్ఐ భూషణం శశివర్మ రూ. లక్ష విలువ చేసే క్రీడా వస్తువులను సంబేపల్లి పాఠశాలకు ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. దాతలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు కూడా తాము పెరిగి పెద్దయిన తర్వాత సమాజం కోసం కొంచెం పాటుపడాలన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు పొందిన దేవప్రసాదరెడ్డిని శాలువతో సత్కరించారు. ఏకలవ్య ఫౌండేషన్, చెకుముకి, స్వర్ణాంధ్ర విజన్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్‌లు నాగేశ్వర నాయుడు, శశిధర్‌రెడ్డి, గోపాల్, ఓబిసి మోర్చా డిస్టిక్ ప్రెసిడెంట్ రేపన శివప్రసాద్, ఎన్నారై భూషణ్ శశివర్మ, మాజీ జెడ్పిటిసి నరసారెడ్డి, మాజీ ఎంపిటిసి శివప్రసాద్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు కొండ భాస్కర్ రెడ్డి, గొల్లపల్లి సుబ్బారెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌లు రెడ్డి రాణి, రెడ్డి మోహన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సూర్యనారాయణది ఆత్మహత్య కాదు, హత్యే : సిపిఎం

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బి.కొత్తకోట మండలంలోని గుట్టమీద దళితవాడలో మరణించిన సూర్యనారాయణ ఆత్మహత్య చేసుకోలేదని, అదే గ్రామంలో నివసిస్తున్న డి.జయన్న, డి.అమర్‌నాథ్‌లు తీవ్రంగా దాడి చేసి కొట్టి గాయపరిచిన కారణంగానే మరణించాడని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మదనపల్లి జిల్లా ఆసుపత్రి మార్చురీలో ఉన్న సూర్యనారాయణ మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తన కూతుర్ని ప్రేమిస్తున్నాడని, జయన్న, ఆయన అన్న అమర్‌నాథ్‌లు గ్రామ సమీపంలో సూర్యనారాయణను అడ్డగించి శనివారం రాత్రి తీవ్రంగా కొట్టి చిత్రహింసలకు గురిచేసినట్లు గ్రామస్థులు అందరూ చెబుతున్నారని పేరొన్నారు. జయన్న, అమర్‌నాథ్‌ల నుండి సూర్యనారాయణ గ్రామస్థులు విడిపించి ఇక నుంచి ఆడబిడ్డ జోలికి వెళ్లొద్దని సూర్యనారాయణకు నచ్చచెప్పి ఇంటికి పంపించారని వివరించారు. జరిగిన అవమానాన్ని ఎవరికీ చెప్పుకోలేక ఆదివారం ఆర్ఎంపి డాక్టర్ వద్ద చికిత్స చేయించుకున్న సూర్యనారాయణ, సోమవారం ఉదయానికల్లా సొమ్మసిల్లి పడిపోయాడని, ఏమి జరిగిందోనని ఆందోళన చెందిన తల్లి సోపు నీళ్లు తాగించిందని పేర్కొన్నారు. సంఘటన జరిగిన వెంటనే ఫిర్యాదు చేయలేదని, తల్లి సోపునీళ్లు తాగించిందని ఆత్మహత్యగా కేసు నమోదు చేయాలని పోలీసులు ఒత్తిడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సూర్యనారాయణను జయన్న, అమర్‌నాథ్‌లు విచక్షణా రహితంగా కొట్టి హింసించిన కారణంగానే చనిపోయాడని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఫిర్యాదు చేసినా పోలీసులు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేయడంలోని అంతర్యమేమిటని ప్రశ్నించారు. మదనపల్లి డిఎస్‌పి కార్యాలయంలో సూర్యనారాయణ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదును తీసుకోకుండా ఎందుకు తిరిగి రాపించారని ప్రశ్నించారు. మర్మాంగంపై ఉన్న గాయాలను పోలీసులు నమోదు చేయలేదంటే కేసును నీరుగార్చేందుకు పోలీసులు అమ్ముడు పోయారా అని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహం ప్రయివేటు భాగల్లో గాయాలు స్పష్టంగా కనిపిస్తున్నా హత్య కేసుగా నమోదుచేయకుండా అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేయడం వల్లనే పోలీసులపై అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. ఎస్‌పి స్పందించి సమగ్ర విచారణ జరిపించి సూర్యనారాయణ మరణం హత్య కేసుగా మార్చాలని లేనిపక్షంలో భాదితులకు అండగా పోరాడుతామని హెచ్చరించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. న్యాయం జరిగే వరకు సిపిఎం అండగా ఉండి పోరాడుతుందని ధైర్యం చెప్పారు.

జిల్లాలో నూతన మద్యం పాలసీ అమలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో నూతన మద్యం పాలసీ - 2024 అమలులోకి రానున్న సందర్భంగా జిల్లాలో 111 మద్యం షాపులకు అక్టోబరు 9 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, జనాభా ప్రాతిపదికన లైసెన్స్ రుసుం నిర్ణయించబడుతుందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నూతన మద్యం పాలసీ 2024పై కలెక్టర్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మద్యం పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం జీవో 211ను విడుదల చేసిందని, జీవోలోని నిబంధనల మేరకు మద్యం షాపుల ఏర్పాటు, నిర్వహణ ఉండబోతుందని తెలిపారు. జిల్లాకు సంబంధించి 111 షాపులకు ఈనెల 1న నోటిఫికేషన్ విడుదల అయిందని, 9న సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్ లైన్‌లో కానీ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. 11 న జిల్లా కలెక్టర్, లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపుల ఏర్పాటుకు ఎంపిక కాబడిన దరఖాస్తులను ఖరారు చేస్తారన్నారు. మద్యం షాపుల ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

పకడ్బందీగా ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి

ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖామంత్రి మంగళగిరిలోని సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి ఫ్రీ హోల్డ్ భూములపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణరావు, ఎడి సర్వే జయరాజ్, డిపిఒ ధనలక్ష్మి, కలెక్టరేట్ తహశీల్దార్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూముల రీ వెరిఫికేషన్‌కు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. స్పెషల్ చీఫ్ సెక్రెటరీ (రెవిన్యూ) సిసోడియా మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి పిజిఆర్‌ఎస్ లో భూమి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఇందులో భాగంగా పిజిఆర్ ఎస్ లో వచ్చిన ఆర్ఒఆర్, భూసేకరణ, సెక్షన్ 22ఎ, భూ ఆక్రమణ చట్టం, అసైన్మెంట్ భూముల ఫ్రీ హోల్డ్ భూముల అంశాలలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పూర్తి నివేదికలతో పారదర్శకంగా దరఖాస్తులను నాణ్యతతో ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ అయిన భూముల పరిశీలన వివరాలు, పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను రెవెన్యూ శాఖా మంత్రికి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి వివరించారు.

'అన్నమాచార్య'లో గాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య యూనివర్సిటీలో మంగళవారం జాతిపిత మహాత్మగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. టచ్ స్టోన్ విభాగం వారు యూనివర్సిటీ విద్యార్థులకు 'మహాత్ముని జీవన విధానం, గొప్ప ఆలోచనలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సిఎస్ఇ తృతీయ సంవత్సరం విద్యార్థిని వెంకట దీప్తి మొదటి బహుమతి కైవసం చేసుకోగా, ఎంసిఎ మొదటి సంవత్సరం విద్యార్థిని మధువాణి ద్వితీయ బహుమతి, ఆర్ సాజియా సిఎస్ఇ మొదటి సంవత్సరం తృతీయ బహుమతిని గెలుపొందారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ మహాత్మగాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, వారు తన జీవితాన్ని జాతికి అంకితం చేశారని కొనియాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి నారాయణ మాట్లాడుతూ గాంధీజీ అహింస అనే మార్గాన్ని బలమైన ఆయుధంగా చేసుకొని బ్రిటీష్ వారిని భారతదేశం నుంచి వెల్లగొట్టారన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లి ఖార్జునరావు, హెచ్.అండ్.ఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.బాలనాగేంద్ర ప్రసాద్, టచ్ స్టోన్ కో-ఆర్డినేటర్ పి.విజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాకు 'స్వచ్ఛతా హీ సేవా'లో ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి - రాయచోటి

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఉత్తమ పనితీరుతో మంచి కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను స్వచ్ఛతా హీ సేవా-2024 గ్రామీణ విభాగంలో, సఫాయి మిత్ర సురక్ష కాంపోనెంట్‌లో జిల్లా ఉత్తమ అవార్డు పొందిందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును అన్నమయ్య జిల్లా తరపున జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, అక్టోబర్ 2న మచిలీపట్నంలో జరగబోయే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా అందుకుంటారని ఆయన తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన జిల్లా సంయుక్త కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, సిపిఒ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్ అండ్ ఆర్ డి, పంచాయతీ సెక్రటరీలు, సఫాయి మిత్రాలు, ఆరోగ్యశాఖ సిబ్బందికి ఈ సందర్భంగా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

నందలూరు రైల్వేకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - నందలూరు

దశాబ్దాల పాటు ఒక వెలుగు వెలిగిన నందలూరు రైల్వేకు న్యాయం చేయాలని నందలూరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో టిడిని నేతలు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ అడిషనల్ డివిజన్ రైల్వే మేనేజర్ సుధాకర్‌కు విన్నవించారు. మంగళవారం నందలూరుకు విచ్చేసిన ఎడిఆర్ఎం సుధాకర్‌ను కలిసి నందలూరు రైల్వే సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గతంలో నందలూరులో అన్ని రైళ్ళు నిలబడేవని ప్రస్తుతం అనేక రైలు స్టాపింగ్ ఎత్తివేయడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రైళ్లను నిలిపేలా కృషి చేయాలని విన్నవించారు. ప్రస్తుతం నందలూరు రైల్వే కేంద్రంలో వందల ఎకరాల స్థలంతో పాటు మంచి నీటి సౌకర్యం పుష్కలంగా ఉందని కావలసిన భవనాలు కూడా అందుబాటులో ఉన్నాయని తమరు దయవుంచి నందలూరు రైల్వే కి న్యాయం చేయాలని విన్నవించారు. రైల్వే కళ్యాణ మండపంలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారే పరిస్థితికి చేరుకుందని గతంలో వచ్చిన ఏసీలను వెనక్కి పంపించేశారని తమరైన కళ్యాణమండపంపై దృష్టి సారించి అభివృద్ధి చేయాలని కోరారు. నందలూరు రైల్వే కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్క అధికారికి మా సమస్యలు చెబుతున్నామని తమరైన మాకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్ అమీర్, తెలుగుదేశం పార్టీ నాయకులు కానకుర్తి వెంకటయ్య, మౌలా, మట్టి బాబు, మెహర్, తుమ్మాది శివకుమార్, సిరిశాల నాగేంద్ర, దండు నాగేశ్వరరావు, శివ, నరసింహులు. శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యుత్ నియంత్రణ మండలి పేరుతో రూ.7200 కోట్ల సర్దుబాటు ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. 2022-23లో వినియోగించిన విద్యుత్‌పై అదనంగా సర్దుబాటు ఛార్జీల వసూలుపై ప్రతిపాదనకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ ప్రకటన విడుదల చేసిందని తెలిపారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ సిపి డిసిఎల్ యూనిట్‌కు ఒక్కో త్రైమాసికానికి రూ.3.27, రూ.1.50, రూ.1.47, రూ.0.45 చొప్పున, ఎస్‌పిడిసిఎల్ రూ.1.92, రూ.1.43, రూ.0.82, రూ.0.03 చొప్పున, ఇపిడిసిఎల్ రూ.2.07, రూ.1.39, రూ.1.16, రూ.0.38 చొప్పున వసూలు చేయడానికి పెట్టిన ప్రతిపాదనలపై ఇఆర్‌సి బహిరంగ ప్రకటన ఇచ్చిందని తెలిపారు. అక్టోబర్ 14లోపు అభ్యంతరాలు తీసుకుని, 18న బహిరంగ విచారణ చేస్తామని మండలి ప్రకటించిందని వివరించారు. ఇది మొక్కుబడి తంతు మాత్రమేనని విమర్శించారు. 2014-19లో టిడిపి ప్రభుత్వ హయాం లోనూ, గత వైసిపి ప్రభుత్వ హయాంలోనూ వినియోగించుకున్న విద్యుత్‌పై సర్దుబాటు ఛార్జీల భారాన్ని మోపారని గుర్తుచేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ఉన్న ఛార్జీలను తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాని డిమాండ్ చేశారు.

జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు హారిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : రామాపురం మండలం బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అండర్ -17 జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీలలో మండల పరిధిలోని ఊటుకూరు జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ఉద్దండపు హారిక ఎంపికై జోనల్ స్థాయిలో ఆడనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుహాసిని తెలియజేశారు.

మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ఎంపిక జోనల్ స్థాయిలో ఆడనున్న హారిక తమ పాఠశాలకే కాక తమ ప్రాంతానికి కూడా కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజ రెడ్డి, ఉపాధ్యాయ బృందం హారిక కు అభినందనలు తెలియజేశారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి : ఓటర్ల సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ విజయవాడలోని తన కార్యాలయం నుంచి ఓటర్ల సవరణ ప్రక్రియ - 2025, ప్రతి ఇంటికి వెళ్లి చేసే సర్వే ప్రక్రియ, పోలింగ్ కేంద్రాలలో మార్పులు చేర్పులు, స్వీప్ కార్యక్రమాలు, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ శ్రీధర్ చామకూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇంటింటికి వెళ్లి చేసే సర్వే ప్రక్రియ 99.59 శాతం పూర్తయిందని పేర్కొన్నారు. వివిధ ఫారాల క్లియరెన్స్ పెండింగ్‌లో ఉందని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. స్వీప్ కార్యక్రమాల కోసం నోడల్ అధికారిని ఏర్పాటు చేసినట్లుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఆయనకు తెలిపారు. అనంతరం ఎలక్షన్స్ సెల్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారాలు, తదితర పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణరావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్, ఎలక్షన్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవంగా జీవించేందుకే పింఛన్లు : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి : సమాజంలోని పేద, బలహీన వర్గాలు గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను అందజేస్తున్నామని, రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాయచోటి పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి గుడి వెనుక 30వ వార్డులో ఆయన లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవ్వాతాతలు, వితంతువులు, వైకల్యం ఉన్నవారిని మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను విచారించి పింఛను సొమ్మును అందజేశారు. మంత్రి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పింఛను మొత్తాన్ని పెంచి ముఖ్యమంత్రి పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా వృద్ధులు, బలహీనులు, వితంతువులు, వైకల్యం ఉన్నవారు మొదలైన వారి కష్టాలను తీర్చడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. విభిన్న ప్రతిభా వంతులకు రూ.6 వేలకు పెంచారని, పూర్తిస్థాయిలో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ 15 వేలు పింఛను, కిడ్నీ తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేలు పింఛను ప్రభుత్వం అందజేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, వార్డ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలు..లబ్ధిదారులకు కన్నీళ్లు!

- కాలనీల్లో మౌలిక వసతులు శూన్యం
- చినుకుపడితే వీధుల్లో చిత్తడే చిత్తడి
- కనిపించని రోడ్లు, మురుగునీటి కాలువలు
- నామమాత్రంగా వీధిదీపాలు ఏర్పాటు
- ప్రతి లే అవుట్‌లోనూ ఇదే దుస్థితి

జగనన్న కాలనీలో గుంతల మయంగా మారిన ఓ వీధి

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి ప్రభుత్వ పాలనలో మండల ప్రజలకు కోరినన్ని ఇంటి స్థలాలు దక్కాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో కొన్ని ఇండ్లు కూడా మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు వంతున విధులు కేటాయించింది. నాటి రాష్ట్ర ప్రభుత్వం దానికి అదనంగా రూ.30 వేలు వంతున రుణంగా అందించింది. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు వాగులు, వంకలు, గుట్టలు, కొండల్లో ఉన్నా లబ్ధి పొందిన వారిలో కొందరు ఎంతో ఉత్సాహంగా ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన సాయం చాలక వారి ఇంటి పునాదులకే సరిపోయింది. అంతో, ఇంతో ఆర్థిక స్తోమత ఉండే లబ్ధిదారులు ఓ అడుగు ముందుకు వేసి ఇండ్లను నిర్మించుకున్నారు. మిగిలిన వారిలో కొందరు గోడల వరకు, ఇంకొందరు పైకప్పు వరకు, మరికొందరు పూత పనుల వరకు వెళ్లారు. ఇంటి పనులు పూర్తి చేసుకోకుండానే పరిశీలిస్తూ అప్పులపాలయ్యారు. ఇల్లు మంజూరైందన్న ఆనందం లబ్ధిదారుల్లో ఆవిరైంది. ఇంటి నిర్మాణం పనుల కోసం చేసిన, చేస్తున్న అప్పులు ఎలా తీర్చుకోవాలన్న చింతనలో పడ్డారు.

నిరుపయోగంగా కాలనీలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు

2019-23 మధ్య కాలంలో మండలంలో రెవెన్యూ అధికారులు 43 లే అవుట్లు ఏర్పాటు చేసి మొత్తం 12,831 మందికి ఇంటి స్థలాలు కేటాయించారు. ఏపి హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 3,559 మందికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో కేటాయించి సంబంధిత అధికారులు పనులు చేపట్టారు. కేటాయించిన పునాది రాళ్లు, సిమెంటు, కమ్మీ, ఇసుక, కంకర, ఇటుకల ధరల ఫలితంగా పనుల నత్త నడకన సాగుతున్నాయి. మండలంలోని మంజూరైన 3,559 పక్కా గృహాల్లో 773 ఇండ్లు మాత్రమే పూర్తయ్యాయి. 2,786 ఇండ్లు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. వీటిలో నిర్మాణం పనులు ప్రారంభానికే నోచుకోనివి కూడా చాలానే ఉన్నాయి. కాలనీల్లో ఇండ్ల నిర్మాణం పనులు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నవారు రోడ్లు, మురుగునీటి కాలువలు, నీటి సౌకర్యం, వీధి దీపాలు ఇత్యాది మౌలిక సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షాలకే వీధులన్నీ బురదమయమవుతూ కాలనీవాసులో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరుతుండడంతో అక్కడి ప్లాట్ల లబ్ధిదారులు నిర్మాణం పనులు చేపట్టేందుకు మిన్నకుండి పోతున్నారు. మరికొందరు తమకు కేటాయించిన స్థలంలో బండలు, గుండ్లు రావడంతో వాటిని తొలగించుకునే ఆర్థిక స్తోమత లేక నిస్సహాయ స్థితిలో ఊరకుండి పోతున్నారు. స్థానిక హెరిటేజ్ లేఅవుట్లో 689 మందికి ఇంటి స్థలాలు కేటాయించగా వారిలో 436 మందికి ఇండ్లు మంజూరయ్యాయి. ఈ కాలనీ మొత్తానికి కేవలం రెండు బోర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆ బోర్ల నుండి వీధులకు తాగునీటి సరఫరా పైప్ లైన్ల ఏర్పాటు జరగలేదు. సంబంధిత అధికారులు స్పందించి తమ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసుకుంటున్నారు.

వీధులన్నీ..చీకటి దిబ్బలే..

ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మాణాలు చేపట్టిన లేఅవుట్లలో ఎక్కడా వీధుల నిర్మాణం జరగలేదు. ఎక్కడా తగినన్ని వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. చీకట్లో వీధుల్లో తిరగాలంటే పాములు, ఇతర విష కీటకాల భయం ఉంది. వీధుల్లో కాస్త ఏమరపాటుతో అడుగులు పెట్టామంటే అంతే.. కాలో, చేయో విరగడం తప్పదు. అధికారులు, కాలనీవాసుల పరిస్థితులను అర్థం చేసుకొని తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

- పి.లక్ష్మీ భార్గవి, హెరిటేజ్ కాలనీ, పీలేరు.

అన్ని వీధులకూ నీటి సౌకర్యం కల్పించాలి

నూనె వస్తువుల కర్మాగారం సమీపంలోని లే అవుట్లో సుమారు 600కు పైగా ఇండ్లు ఉన్నాయి. నీటి సౌకర్యం కోసం ఒకే వీధిలో రెండు బోర్లు వేశారు. నీటి సరఫరా కోసం ట్యాంకుల నిర్మాణం కానీ, పైపులైన్ల ఏర్పాటు గానీ జరగలేదు. నీటి కోసం కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అక్కడికి మేం ఒక వీధి వాళ్లం సొంత ఖర్చులతో 150 అడుగుల మేరకు పైపులు తెచ్చి పెట్టుకున్నాం. సంబంధిత అధికారులు స్పందించి బోరు నుంచి పైపులైన్లను ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాం.

- ఎస్.సుజాత, ఆయిల్ ఫెడ్ కాలనీ, పీలేరు.

ఎంఇఒకు డిడి అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.52,350 వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్ విద్యార్థులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.52,350లను సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. డిడిని మండల విద్యాశాఖ అధికారి చక్రధర్ రాజుకు అందించారు. ఈ సందర్భంగా చక్రధర రాజు మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులు ఎంత మొత్తంలో డబ్బు వసూలు చేయడం పట్ల విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి మనిషి సాటి మనిషికి సహాయం చేయాలనే తపన కోరిక విద్యార్థి గత నుంచి ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నరేంద్రనాథ్, ప్రిన్సిపల్ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు నరసింహులు, ఇన్‌ఛార్జి రవీంద్రబాబు, రాధా, జ్యోతి, బాలాజీ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ శివప్రసాద్, సిఆర్‌పిలు లక్ష్మీ, మునెమ్మ, ధర్మేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వృద్ధుల ఆరోగ్యం పట్ల వారి కుటుంబ సభ్యులు శ్రద్ధ వహించాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి యూనిట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని మంచూరు గ్రామంలో వృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలు వస్తూ వుంటాయని, ఎప్పటికప్పుడు తొలి దశలో వాటిని గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కంటి చూపు తగ్గిపోవడం, చెవులు వినపడక పోవడం, అలెర్జీలు, దంతాలు రాలి పోవడం, మతి మరుపు, మోకాళ్ల నొప్పులు, మోకాలి చిప్పలు అరిగి పోవడం, పోషకాహార లేమి, రక్తహీనత, మధుమేహం, రక్త పోటు, కాన్సర్, గుండె జబ్బులు వంటివి సాధారణంగా వస్తూ ఉంటాయన్నారు. శుక్లము కంటి ఆపరేషన్ సరైన సమయంలో గుర్తించి చికిత్స తీసుకోవాన్నారు. సరైన నిద్ర, ఆహారం, వాకింగ్, యోగ, ఆసనాలు క్రమం తప్పకుండా పాటిస్తే జీవితకాలంను పొడిగించుకుని సంతోషంగా జీవించవచ్చునన్నారు. ప్రస్తుతం యాంత్రిక జీవితంలో వృద్ధుల పట్ల నిరాదరణ ఎక్కువగా ఉందని, అందుకే ఎక్కువగా వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 60ఏళ్ల పైబడిన వారికి బిసిజి టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వనిత, ఎఎన్ఎం భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మదనపల్లి

యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మున్సిపల్ ఉపాధ్యాయ పోస్టులను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మంజూరు చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయాల ఎదుట బుధవారం చేయబోవు సత్యాగ్రహ దీక్షను మదనపల్లి డివిజన్లోని ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా యుటిఎఫ్ నాయకులు సుధాకర్ నాయుడు తెలిపారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యల పోరాటాలలో అనేకసార్లు పాల్గొన్నామని చెప్పారు. తాము చేస్తున్న పోరాటం కేవలం మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలకు సంబంధించినదని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొని తమ సత్తాను ప్రభుత్వానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేస్తే కేవలం మదనపల్లి మున్సిపాలిటీకి మాత్రమే సుమారు 95 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రావాల్సి ఉన్నదని, వీటి పరిష్కారం కోసం ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మూఢనమ్మకాలను పారదోలడమే లక్ష్యం : జెవివి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలను పారదోలి సైన్స్‌ను అభివృద్ధి పరచడమే జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్ ముఖ్య ఉద్దేశమని మండల జెవివి అధ్యక్షులు కారణాల శివారెడ్డి పేర్కొన్నారు మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల వచ్చిన పది పాఠశాలల విద్యార్థులు 15 టీములుగా ఏర్పడ్డారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, ప్రవేట్ పాఠశాల తరపున రవిచంద్ర స్కూల్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానానికి కైవసం చేసుకున్నాయి. బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న జ్ఞానాన్ని వెలిగి తీయడానికి జెవివి ఆధ్వర్యంలో చెకింగ్ టాలెంట్ టెస్ట్ ప్రతి సంవత్సరమూ నిర్వహిస్తున్నారని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరీక్షల్లో గెలుపొందిన వారు విజయం సాధిస్తారని అని పేర్కొన్నారు. చెకుముకి టెస్ట్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్‌తో పాటు మెడల్స్ బహుకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివలక్ష్మి, సుబ్బ రాయుడు, మహేశ్వరయ్య, రెడ్డమ్మ, జెవివి సభ్యుడు భాస్కర్, మహమ్మద్ గౌస్, ప్రయివేట్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తా చాటిన 'శ్రీప్రత్యూష' విద్యార్థులు

పుల్లంపేట : మండల కేంద్రంలోని బిపి శేషయ్య సంస్కృత పాఠశాలలో మంగళవారం మండల స్థాయిలో నిర్వహించిన జన విజ్ఞాన వేదిక చెకుముకి పోటీ పరీక్షల్లో వివిధ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఇఒ చక్రధర రాజు పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వలన విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుతుందని తెలియజేశారు. జెవివిమండల కార్యదర్శి వరదారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వంలో పాల్గొంటే రేపటి పౌరులుగా విజయపథంలో నడుస్తారని తెలియజేశారు. చెకుముకి పోటీలలో శ్రీప్రత్యూష హైస్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న బి.కరిష్మా పదవ తరగతి, జి.శివ విశాల్ 9వ తరగతి, కె.లాస్య ఎనిమిదవ తరగతి మొదటి బహుమతి సాధించడం జరిగిందని తెలపారు. రెండవ బహుమతి శ్రీశాంతినికేతన్ హైస్కూల్, మూడవ బహుమతి శ్రీశివ పార్వతి హైస్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారని తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బ నరసింహులు, రాజయ్య పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 15 మంది విద్యార్థులు

రామసముద్రం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పరీక్ష విజయవంతంగా ముగిసిందని ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు అన్నారు. ఈ పరీక్షకు మండలంలోని చెంబకూరు, మట్లవారిపల్లి, రామసముద్రం, మోడల్ పాఠశాల, కెజిబివి, పాఠశాలల నుండి 15 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మండల స్థాయిలో మొదటి స్థానం పొందిన చెంబకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.గణేష్, సాయి సుదీప్, కెజిబివి చిత్రావతి మొదటి స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో రామసముద్రం విద్యార్థులు నిలిచారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.

మండల స్థాయి విజేతలుగా 'ఆదర్శ' విద్యార్థులు

నిమ్మనపల్లి: మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా ఆదర్శ పాఠశాల విద్యార్థులు నిలిచారని ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీఖాన్ తెలిపారు. మంగళవారం నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్ (తెలుగు)లో జెవివి ఆధ్వర్యంలో మండలంలోని ఎపి ఆదర్శ పాఠశాల, నిమ్మనపల్లి, రెడ్డివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు మండల స్థాయిలో చెకుముకి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి పోటీలలో మొదటి స్థానంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు సి.హాసిని, వికాస్‌రెడ్డి, తేజేష్ నిలవగా, రెండవ స్థానంలో జడ్పీ హైస్కూల్ (తెలుగు) విద్యార్థులు డి.చరిత, కె.శృతి, ఎం.సాయి లిఖిత నిలిచారన్నారు. మూడవ స్థానంలో జడ్పీ హైస్కూల్ రెడ్డివారిపల్లి విద్యార్థులు నిలిచారని తెలిపారు. ఈ పోటీ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, ట్రోఫీలను హెచ్ఎం అంజాద్ అలీఖాన్ ప్రధానం చేశారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు త్వరలో రాయచోటిలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట గోపాల్, రమణ ప్రసాద్, రెడ్డిశేఖర్, జనార్ధన్, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రేమాలయంను సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి- రామాపురం : మండల పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమాన్ని లక్కిరెడ్డిపల్లి జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఫైజున్నిషా మంగళవారం సందర్శించారు ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వాతావరణం పరిస్థితులు వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఎలాంటి వసతి కల్పిస్తున్నారని ప్రేమాలయం మేనేజర్‌ను అడిగారు. వృద్ధులను ప్రేమానురాగాలతో చూసుకోవాలని అక్కడ పని చేస్తున్న వారికి సూచించారు. జడ్జివెంట రామపురం పోలీసులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఉన్నత పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-వీరబల్లి : రాయచోటి మాసాపేటలో సోమవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలలో వీరబల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య, ఫిజికల్ డైరెక్టర్ వేణు మాధవ రాజు తెలిపారు. సాఫ్ట్ బాల్ అండర్ - 17 బాలుర విభాగంలో భరత్, నాసర్ అండర్-17 బాలికల విభాగంలో సాఫ్ట్ బాల్‌లో కావ్య, అండర్- 17 బేస్ బాల్ బాలుర విభాగంలో నాసర్, అండర్-14 విభాగంలో సాఫ్ట్ బాల్‌లో వేణుగోపాల్, అండర్ -14 బాలికల విభాగంలో సాత్విక, అండర్-14 బాలికల విభాగం బేస్‌బాల్ సాత్విక ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో వారిని ఎంపిడిఒ మల్లీశ్వరి, విఆర్‌డిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని అభిలాషించారు. అనంతరం వారిని పతకాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్య కుమార్, రామచంద్ర, సుబ్బారెడ్డి, రవిచంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ మాజీ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని కొండ్లోపల్లి ఎంపియుపి పాఠశాలలో నాలుగేళ్లుగా పాఠశాల కమిటీ చైర్మన్‌గా విశేష సేవలందించిన చౌడవరం నరసింహను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ మాట్లాడుతూ పాఠశాల కమిటీ చైర్మన్‌గా చౌడవరం నరసింహ పాఠశాలకు ఎన్నో విధాలుగా తన సహాయ సహకారాలు అందజేశారన్నారు. రెండేళ్లల్లో సంవత్సరాలలో నాడు-నేడు కార్యక్రమాలలో ప్రతి పనినీ తన సొంతంగా భావించి చిత్తశుద్ధితో పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. అంతటి నిబద్ధత, వినయ విధేయతలు కలిగి చైర్మెన్‌గా అతను చేసిన కృషిని కొనియాడుతూ పాఠశాల యాజమాన్యం ఆయనను సన్మానించుకోవడం గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘునాథ్, సుబ్బారెడ్డి, చాంద్‌బాషా, ప్రస్తుత పాఠశాల చైర్మెన్ నరసింహులు పాల్గొన్నారు.

వెయ్యి అడుగుల గాంధీ చిత్రపటం

ప్రజాశక్తి-రామాపురం : గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆర్ట్ మాస్టర్ ఆనంద్ రాజు వెయ్యి అడుగుల మహాత్మా గాంధీ చిత్రపటాన్ని రూపొందించారు. ప్రపంచంలో వెయ్యి అడుగుల మహాత్మా గాంధీ చిత్రపటాన్ని వేయడం ప్రపంచ రికార్డు సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మట్లిలో రాయితీ ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి - వీరబల్లి: మండలంలోని మట్లి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో మంగళవారం టిడిపి సర్పంచ్ నాగార్జున చారి రైతులకు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి స్వాతి ఆదేశాల మేరకే సర్పంచ్ నాగార్జున చారి, టిడిపి నాయకులు, ఎంపిఇఒ మంజుష, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇచ్చిన ఉలువలను వృథా చేసుకోకుండా తమ భూమిలో విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించండి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు: ప్రతి రైతు చీడ పీడల నివారణకు శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏర్పడినంతపల్లె కంద్రిక గ్రామాలలో రైతులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సూచనల ప్రకారం వాడితే అనవసరపు ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఉద్యాన పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త శ్రీధర్ మాట్లాడుతూ అరటి, బొప్పాయి, మామిడిలో అధిక దిగుబడులు సాధించుటకు తీసుకొనవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ అధికారి భాస్కర్ ఉద్యాన శాఖ ద్వారా అమల వుతున్న పథకాలు గురించి రైతులకు తెలియజేశారు.ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివిధ కషయాల ఉపయోగం,తయారీ విధానం గురించి రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విహెచ్ఎ లు అంజలి,దినేష్,పశుసంవర్ధక శాఖ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది, ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

కేసులు బనాయించడం సరికాదు : బిఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి : బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలపై రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా మదనపల్లిలో బిఎస్‌పి నిర్వహించిన నిరసన ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు, బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్‌ను, కొంతమంది బిఎస్‌పి కార్యకర్తలను అదుపులోకి తీసుకొని కేసులు బనాయించడం సరికాదని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత వైసిపి పాలన కంటే అధికంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలపై దాడులు నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న పార్టీల ఎమ్మెల్యేలే స్వయంగా అట్రాసిటీలకు పాల్పడుతున్నారున్నారు. శాసన సభ్యులు రఘురామకృష్ణరాజు అంబేద్కర్ చిత్రపటాన్ని తొలగించడం, కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీ దళిత డాక్టర్ పై దాడి చేయడం లాంటి సంఘటనలు చాలా బాధాకరమన్నారు. మదనపల్లెలో దళితుల మీద దాడులు బాధితులకు తక్షణం న్యాయం చేయాలన్నారు. బందెల గౌతమ్ కుమార్ ఎంతో ప్రశాంతంగా రాజ్యాంగబద్ధంగా నిరసన తెలియజేస్తుంటే పోలీసులు నిర్దాక్షణంగా అదుపులోకి తీసుకొని, అక్రమ కేసులు బనాయించడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పు చేసిన శాసనసభ్యులపై చర్యలు తీసుకొని నిరసన తెలిపే వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి ఆంజనేయులు, రాజంపేట ఇన్‌ఛార్జి నరసింహులు, మద్ది రేవుల ఆంజనేయులు, ప్రియా, కొండమ్మ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శోభ, మహిళలు

చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి

- ఎపివివియు రాష్ట్ర మహిళ కార్యదర్శి శోభ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నా 50 శాతం పైగా గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు తిండికి కూడా నోచుకోలేని దుస్థితిలో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళ కార్యదర్శి కె.శోభ అన్నారు. ఈ నెల16న ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ నుంచి దానిని 'ఆకలి దినంగా' పరిగణించి మంగళవారం నిమ్మనపల్లె పంచాయతీ కొత్తవారిపల్లెలో యూనియన్ కమిటీ సభ్యులతో కలసి కరపత్రాలను విడుదల చేశారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆకలి దినోత్సవంపై చైతన్య యాత్రలను ప్రారంభించి 15 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ఆహార హక్కు, పని హక్కు, కనీస వేతనాల హక్కు, భూమి హక్కు, సాంఘిక భద్రత హక్కు ఇలా ఎన్నో హక్కులు ఉన్నాయని, అవి కేవలం కాగితాలకూ, ప్రసంగాలకు మాత్రమే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. చట్టబద్ధమైన (రాజ్యాంగబద్ధమైన) హక్కులు ఇంకా పూర్తి స్థాయిలో ప్రజలకు దక్కలేదన్నారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వీటిని అమలు చేసినప్పుడే నిరుపేద ప్రజల ఆకలి కేకలు ఆగుతాయని పేర్కొన్నారు. అసంఘటిత కార్మికులందరూ ఏకమై తమ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న డాక్టర్

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కలకడ

అసంక్రమమైన వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎంవి.కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఆరు వరకు ఎండలు తీవ్రతగా ఉన్నాయని ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, 50 ఏళ్ల పైబడిన వృద్ధులు ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. బయట ప్రాంతాలు పోయేటప్పుడు గొడుగు, మంచినీళ, మజ్జిగ బాటల్స్, తలకు తలపాగా, ప్రతి ఒక్కరూ పల్చటి దుస్తులు ధరించాలన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గర్భిణులు కూడా తగు జాగ్రత్త పాటించాలన్నారు. అసంక్రమమైన వ్యాధులు రక్తపోటు, షుగరు వ్యాధులకు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. స్కూలు, అంగన్వాడీని సందర్శించి అక్కడ చిరు వ్యాధులు గురించి వివరించారు. ఆరోగ్య కార్యకర్త ఎఎన్ఎ యాప్స్‌లో ఉన్న పెండింగ్ అంతా కంప్లీట్ చేయమని ఆరోగ్య కార్యకర్తకు ఆదేశించారు. మధుమేహనం, హైపర్ టెన్షన్, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ జి.జయరామయ్య, హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు సి.లక్ష్మిదేవి ఎంఎల్‌హెచ్‌పిజెఎస్ గోపికృష్ణ, డేటా ఎంట్రీ రోజా పైలట్ రమేష్, ఆశా కార్యకర్త కె.పద్మావతి, అంగనవాడీ కార్యకర్త ఎం.శోభ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసుస్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పీలేరు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుగుణమ్మ

ఓ వివాహిత మహిళ పురుగుల మందు తాగి పోలీసుస్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం పీలేరులో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరు మండలం, కాకులారంపల్లి పంచాయతీ, ఇందిరమ్మ కాలనీలో సుగుణమ్మ అనే మహిళ తన కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటోంది. రెండు నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజ చేసి, ఆ అక్షింతలను ఆమె ఇంటి చుట్టూ చల్లి ఉండడాన్ని గుర్తించారు. ఆమె కుటుంబ సభ్యులు కొద్ది రోజుల తర్వాత ఇంటి చుట్టూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. గత నెల 19న ఇదే కాలనీకి చెందిన తాటిపత్రి నాగరాజ అనే వ్యక్తి క్షుద్ర పూజలు చేయించి అక్షింతలను ఆమె ఇంటి చుట్టూ చల్లడాన్ని సిసి కెమెరాల్లో నమోదై ఉండడాన్ని గుర్తించి, సుగుణమ్మ కుటుంబ సభ్యులు పీలేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో నాగరాజ కుమార్తె అపరంజి తనను సుగుణమ్మ తమ్ముడు సత్య నారాయణ అత్యాచారయత్నం చేశాడంటూ ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఇరువురి కేసులు పరిశీలనలో భాగంగా విచారణ నిమిత్తం ఈ వర్గాలను పోలీసులు స్టేషనుకు పిలిపించారు. ఇక తమకు న్యాయం జరగదన్న అనుమానంతో సుగుణమ్మ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందును స్టేషన్‌లోనే తాగి ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించింది. ఆమెను పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నట్లు బంధువులు చెప్పారు. కేసు విషయమై సిఐ యుగంధర్‌ను వివరణ కోరగా ఇరువురి ఫిర్యాదులు పరిశీలిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు తెలియజేశారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని గుమ్మసముద్రం చెరువు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ట్రాక్టరును పోలీసుస్టేషనుకు తరలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మండలంలో ఎవరైనా అక్రమంగా తీసుకున్న తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని హై స్కూల్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. వివరాలు.. గరుగుపల్లి గొల్లపల్లి చెందిన ఇర్రి మహేశ్వర్ నాయుడు బైక్‌పై బస్టాండ్ నుంచి బయలుదేరాడు. హైస్కూల్ వద్దకు రాగానే అదేసమయంలో షేక్ ఖయ్యూం బాష గేటు వైపు బైక్‌పై వస్తున్నాడు. మహేశ్వర్ నాయుడు అతివేగంగా వాహనం నడుపుతూ ఎదురుగా వస్తున్న ఖయ్యూం భాషా బైకును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బాషకు తీవ్ర గాయాలయ్యాయి. మహేశ్వర్ నాయుడుకు కుడికాలు విరిగింది. స్థానికులు గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగని చికిత్స నిమిత్తము వేలూరు తరలించినట్లు ఎఎస్ఐ అంజిరెడ్డి పేర్కొన్నారు.

పేరు మార్పు

దూదేకుల కరీముల్లా అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. తండ్రి దూదేకుల వజీర్ అలీ, ఇంటి నెంబర్ 16/128, మహమ్మద్ పురా విధి, కొత్తపల్లి, రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు **దూదేకుల కరీముల్లా**గా వాడుకలో ఉన్న నా పేరును **షేక్ నాయబ్ కరీముల్లా**గా మార్చుకున్నాను. ఇక నుండి నా పేరు **షేక్ నాయబ్ కరీముల్లా** గమనించగలరు.

పేరు మార్పు

దూదేకుల మస్తాని అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. నా భర్త షేక్ నాయబ్ వజీర్ వలి, ఇంటి నెంబర్ 16/128, మహమ్మద్ పురా విధి, కొత్తపల్లి, రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటు న్నాను. నేను ఇప్పటి వరకు **దూదేకుల మస్తాని** గా వాడుకలో ఉన్న నా పేరును **షేక్ నాయబ్ దూదేకుల మస్తాన్‌బి**గా మార్చుకున్నాను. ఇక నుండి నా పేరు **షేక్ నాయబ్ దూదేకుల మస్తాన్ బి** గమనించగలరు.

పేరు మార్పు

దూదేకుల వజీర్ అలీ అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. తండ్రి షేక్ నాయబ్ అక్బర్ అలీ, ఇంటి నెంబర్ 16/128, మహమ్మద్ పురా విధి,కొత్తపల్లి,రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు **దూదేకుల వజీర్ అలీ** గా వాడుకలో ఉన్న నా పేరును **షేక్ నాయబ్ వజీర్ వలి** గా మార్చుకున్నాను.ఇక నుండి నా పేరు **షేక్ నాయబ్ వజీర్ వలి** గమనించగలరు.